క్లుప్తంగా

రహదారి అభివృద్ధి



జేసీబీతో రహదారిని బాగు చేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని రామతీర్థం కాజ్‌వే సమీపంలో చంపావతి నదిలో ఉన్న శ్మశానానికి వెళ్లే రహదారిని శుక్రవారం అభివృద్ధి చేశారు. స్థానిక కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ తన సొంత నిధులు వెచ్చించి జేసీబీతో రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. జేసీబీతో గోతులను మట్టితో పూడ్చారు. అలాగే శ్మశానంలో బోరు ఏర్పాటు చేయనున్నారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు పనులను పర్యవేక్షించారు.

పేర్లు నమోదు చేసుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసుదేవరావు

డెంకాడ: రానున్న ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాల కోసం ఆర్‌బీకేల్లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ నాగ భూషణరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పతివాడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌బీకేల్లో విత్తనాలతో పాటు ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఏఓ నిర్మల, పశువైద్యులు సాగర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'వాక్ ఫర్ పీస్' ర్యాలీ

చీపురుపల్లి: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ యూత్ వింగ్, కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న 'వాక్ ఫర్ పీస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక బ్రహ్మకుమారీ సేవా కేంద్రం ఇన్‌చార్జి బీకే శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 5.45 గంటలకు పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుర్ల: మండలంలోని గొల్లలపేట అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), వల్లాపురం మినీ అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ) పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నెల్లిమర్ల సీడీపీఓ ఆరుద్ర శుక్రవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా ఉంటున్న మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 22లోగా నెల్లిమర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష రేపు

లక్కవరపుకోట, కొత్తవలస: ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాళ్లు పి.శివప్రసాద్, కె.ధర్మకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస ఆదర్శ పాఠశాలలో వంద సీట్లు అందుబాటులో ఉండగా 304 దరఖాస్తులు, లక్కవరపుకోట ఆదర్శ పాఠశాలలో వంద సీట్లకు గాను 206 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

మిగులు సీట్ల భర్తీకి 14న ప్రవేశ పరీక్ష

లక్కవరపుకోట: మహాత్మ జ్యోతీబాపూలే గురుకుల విద్యాలయాల్లో 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి ఈ నెల 14న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎల్.కోట పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల మండల కేంద్రంలోని జ్యోతీబాపూలే పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులలో ప్రశ్నలు ఉంటాయని, ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

పాఠశాలలకు చేరుకున్న 'విద్యాకానుకలు'

దత్తిరాజేరు: మండలంలోని 6 ఉన్నత పాఠశాలలు, 42 ప్రాథమిక పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు చేరుకున్నాయని ఎంఈఓ వెంకటరావు శుక్రవారం తెలిపారు. వాటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేయడం జరిగిందన్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున వాటిని విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి లక్ష్యం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- చేపలకంచేరులో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

భోగాపురం: ప్రజా సంక్షేమం, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చేపలకంచేరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి అప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో 98 శాతానికి పైగా హామీలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారన్నారు. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిస్తుండడంతో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ఓర్వలేకే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. చంద్రబాబు ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అరజల్ల నర్సింగరావు, పీబీ రెడ్డి, పడాల భానుప్రకాష్, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, యర్రప్పలనారాయణ, సుందర హరీష్, మైలపిల్లి ఎల్లారావు, కర్రోతు శ్రీనివాసరావు, సీత, కొల్లు రామ్మూర్తి, పోతిరెండి గోపిరావు, పరాపాలన అధికారి దాసరి బంగారయ్య, ఏఓ హరికృష్ణ, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి రేషన్ అందజేత



దివ్యాంగురాలు మంగమ్మకి రేషన్ సరుకులు అందించిన యూత్ ఫౌండేషన్ సభ్యులు

విజయనగరం: నిరుపేద దివ్యాంగురాలికి అండగా నిలిచింది విజయగనరం యూత్ ఫౌండేషన్ సంస్థ. నెల్లిమర్ల నగర పంచాయతీలోని కీర్తివీధికి చెందిన దివ్యాంగురాలు మంగమ్మకు చిన్నతనంలో తల్లిదండ్రులు చనిపోవడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.3000 పింఛను మొత్తంతో జీవనం సాగిస్తోంది. మంగమ్మ పరిస్థితి తెలుసుకున్న విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గల రాయల్ క్యాబ్స్ వద్ద రెండు నెలలకు సరిపడా రేషన్ అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామష్, సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, రఘు, విజయ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్వజ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు



లక్ష్మీనరసింహస్వామి ఆలయం పూజలు చేస్తున్న పండితులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఎంబరేయగుళ్ల గ్రామంలో 11వ శతాబ్దంలో నిర్మించిన అతి పురాతన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ధ్వజ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, యుక్త హోమం, క్షీరాదివాస, జలాధివాసం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాక్సింగ్ కిట్ల పంపిణీ



బాక్సింగ్ క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న అవనాపు విక్రమ్

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ బాక్సింగ్ కిట్లను శుక్రవారం అందజేశారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన బుగత చంద్రశేఖర్‌తో పాటు పి.దేవకుమార్‌లను అభినందించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ, ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు సిక్కిం రాష్ట్రంలో జరగబోయే పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముని లక్ష్మణరావు, సంపత్ రాజు, ఎన్నింటి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నీ విజేత వెంకటరాజుపాలెం



ఉత్సాహంగా జరుగుతున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

జామి: మండలంలోని వీఆర్‌పాలెం గ్రామంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 23 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో వెంకటరాజుపాలెం జట్టు(పి.హరీష్, గణేష్), ద్వితీయ స్థానంలో వీఆర్ పాలెం జట్టు(బి.అర్జున్, జె.వెంకటరావు), తృతీయ స్థానంలో పెదవేమలి జట్టు (ఎస్.అప్పలసత్యం, రవి) నిలిచాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకం అందజేశారు.

విత్తనాల కొరత లేకుండా చర్యలు

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు వరి విత్తనాలు కొరత లేకుండా చూడాలని, ముందస్తుగా విత్తనాలు తెప్పించి ఆర్‌బీకేల్లో నిల్వ చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. బొండపల్లి ఆర్‌బీకేలో శుక్రవారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. రైతులుకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ పి.వి.మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, ఏఓఈ సంతోష్‌కుమార్, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ బండారు శ్రీను, సలహా మండలి సభ్యులు కోరాడ సత్యనారాయణ, సుంకరి శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.15 కోట్ల రుణాలు అందజేత



మహిళలకు చెక్కును అందచేస్తున్న బ్యాంకు మేనేజరు శ్రీభట్

బొండపల్లి: స్వయం సహాయక సంఘాలకు అందచేస్తున్న బ్యాంకు రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని యూనియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజరు శ్రీ భట్ అన్నారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళా సంఘాలతో పాటు వివిధ పథకాల కింద రుణాలు మంజూరైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.15కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రుణాలు పొందిన లబ్ధిదారులు వారి వ్యాపారాలను వృద్ధి చేసుకుని ఆదాయం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ ప్రభు, సహాయ జనరల్ మేనేజర్ సుధాకర్, బ్యాంకు రీజనల్ మేనేజర్ నరేష్, పి.వి.మల్లేశ్వరరావు, మాధూరి, శ్రీనివాస్, చైతన్య, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలి



కొత్తవలస: గర్భిణికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



జామి: గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న డాక్టర్ భాగ్యరేఖ



దత్తిరాజేరు: గర్భిణులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి స్రవంతి

కొత్తవలస: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే గర్భిణులు ప్రసవాలు చేయించుకునేలా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వారికి అవగాహన కల్పించాలని వియ్యంపేట పీహెచ్‌సీ డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం 62 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. 22 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. పాలు, గుడ్లు, బెల్లంతో చేసిన పప్పు చెక్కీలు, ఆకుకూరలను ఆహారంతో తీసుకోవాలని సూచించారు. ఐరన్, కాల్షియం, బీకాంప్లెక్స్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంహాద్రినాయుడు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

దత్తిరాజేరు: పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కె.కొత్తవలస వైద్యాధికారి స్రవంతి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 15 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని, చిన్నచిన్న పనులు చేయడం ద్వారా ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ఆకుకూరలు, పాలు, కూరగాయలు ఎక్కువగా తినాలని సూచించారు.

పౌష్టికాహారం పంపిణీ

జామి: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన గర్భిణులకు స్టేట్ బ్యాంక్ ఉద్యోగి కాకర శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు ఉచితంగా పౌష్టికాహారం అందజేశారు. వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డాక్టర్ భాగ్యరేఖ గర్భిణులకు భోజనాలు వడ్డించారు.

ముందస్తుగా విత్తనాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు

గుర్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులందరికీ వరి విత్తనాలు అందించాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందని వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు, మండల అగ్రికల్చరల్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముద్దాడ కేశవరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌కు సంబంధించి రైతుల అవసరాలు, విత్తనాలు, ఎరువులు, సాగునీటి వసతులపై చర్చించారు. రైతులకు సాగులో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా అగ్రికల్చరల్ అడ్వైజరీ బోర్డు డైరెక్టర్ కెంగువ మధుసూదనరావు, ఏఓ తిరుపతిరావు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై డ్రోన్స్



మాట్లాడుతున్న ఏఓ కిరణ్‌కుమార్

జామి: వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వార ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేసేందుకు అధునాతన డ్రోన్లను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తోందని వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం వివరాలను వెల్లడించారు. రైతు తన వాటాగా 10 శాతం చెల్లిస్తే, ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుందని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. డ్రోన్ వినియోగంపై నిరుద్యోగ యువతకు గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(లాం ఫారం)లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల రమణబాబు, సభ్యులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ కుటుంబానికి అండగా ఉంటాం



పాస్టర్ కిరణ్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న పాస్టర్ మధుమనోహర్

విజయనగరం టౌన్: రోడ్డు ప్రమాదంలో కుమారుడ్ని పోగొట్టుకుని భార్యాబిడ్డలతో పాటు తీవ్ర గాయాలపాలైన పాస్టర్ కిరణ్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని హార్ట్ ఫర్ నేషన్ ఫౌండర్ పాస్టర్ మధుమనోహర్ అన్నారు. ఈ మేరకు తోటి పాస్టర్లతో కలిసి కిరణ్‌కుమార్ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. తన వంతు సాయంగా మధుమనోహర్ రూ. 12 వేలు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు బిషప్ పిరిడి పాల్, రెవరెండ్ యబ్బోజు చౌదరి, రెవరెండ్ పద్మకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులతో ఉపయోగం



శిక్షణ తీసుకున్న విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని సత్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. శుక్రవారం స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో మే ఒకటో తేదీ నుంచి 31 వరకు కరాటే వేసవి శిక్షణా శిబిరం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 40 మంది విద్యార్థులు కోచ్ సంతోష్ నేతృత్వంలో శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పూర్తయిన వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు మాట్లాడుతూ, విద్యార్థులకు శిక్షణతో పాటు సర్టిఫికేట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు బదిలీలు

నెల్లిమర్ల: మండలంలోని పలు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు బదిలీలు జరిగాయి. సారిపల్లి హెచ్‌ఎం డి. రాముకు గరివిడి మండలం కాపు శంభాంకు బదిలీ కాగా.. పూసపాటిరేగ మండలం కుమిలి హెచ్‌ఎం పద్మ సారిపల్లికి బదిలీపై వచ్చారు. పారసాం హెచ్‌ఎం పీజీహెచ్ శ్రీనివాసరావుకు భోగాపురం బదిలీ కాగా గజపతినగరం మండలం లోగిశ హెచ్‌ఎం డి. తిరుపతిరావు పారసాం పాఠశాలకు వచ్చారు. అలాగే కొండవెలగాడ హెచ్‌ఎం విక్టోరియారాణికి విజయనగరం మండలం ద్వారపూడికి బదిలీ కాగా ఆమె స్థానంలో మెంటాడ మండలం చల్లపేట నుంచి జ్ఞానశంకర్ వచ్చారు. మొయిద హెచ్‌ఎం మద్దిల శ్రీనివాసరావుకు చీపురుపల్లి మండలం పెదనడిపల్లికి బదిలీ కాగా.. గుర్ల మండలం తెట్టంగి నుంచి బి. మహాలక్ష్మి మొయిదకు వచ్చారు. అలుగోలు హెచ్‌ఎం ఎస్. జగదీశ్వరరావుకు నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేటకు బదిలీ కాగా.. అక్కడి హెచ్‌ఎం సీహెచ్ రాధాకృష్ణ గుర్ల తమ్మిరాజుపేటకు బదిలీపై వెళ్లారు. గర్భాం నుంచి అలుగోలుకు జీఎస్ కాంతారావు బదిలీపై విచ్చేశారు. సతివాడ హెచ్‌ఎం బి. తిరుపతిరావుకు పెదమానాపురం బదిలీ కాగా.. వసంత హెచ్‌ఎం బంగారునాయుడుకు సతివాడ బదిలీ జరిగింది. కొండగుంపాం హెచ్‌ఎం వై విజయలక్ష్మికి భోగాపురం మండలం రామచంద్రపేటకు బదిలీ కాగా.. గుర్ల మండలం నడుపూరు నుంచి వసంత వేణుగోపాల్ కొండగుంపాం వచ్చారు. నెల్లిమర్ల నగర పంచాయతీ రెల్లివీధి బాలికల పాఠశాల హెచ్‌ఎంగా గుర్ల మండలం చింతలపేట నుంచి శారద బదిలీపై వచ్చారు.

గోతులు పూడ్చి కాలువ అభివృద్ధి



నిర్మాణాలు తొలగించిన తర్వాత సాగునీటి కాలువ

డెంకాడ: మండలంలోని పినతాడివాడ – డెంకాడ గ్రామాల మధ్యలో ఉన్న సాగునీటి కాలువను పూర్వపు స్థితిలో అభివృద్ధి చేసి ఇవ్వాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించడంతో ఎస్యూర్ లే అవుట్ ప్రతినిధులు కాలువను బాగు చేశారు. వివరాల్లోకి వెళితే.. పినతాడివాడ – డెంకాడ గ్రామాల మధ్యలో ఉన్న గెడ్డలో ఎస్యూర్ లే అవుట్ వారు అక్రమంగా గోడను నిర్మిస్తున్నారు. దీంతో చెరువులకు రావాల్సిన నీరు రాకుండా పోతుందని రైతులు, డెంకాడ పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, తదితరులు ఆరోపిస్తూ, నిర్మాణాలు నిలిపివేయాలని లే అవుట్ ప్రతినిధులను కోరారు. అలాగే ఈ విషయాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందిస్తూ, కాలువను బాగు చేయాలని లే అవుట్ ప్రతినిధులు ఆదేశించారు. దీంతో వారు వెనువెంటనే నిర్మాణాలకు తీసిన గుంతలను పూడ్చి, కాలువను బాగు చేశారు.

ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు

- ఎంపీపీ హైమావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను అందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. విత్తనాల మొలక శాతం బాగుంటేనే వాటిని రైతులకు అందించాలన్నారు. అలాగే రైతుఉత్పత్తి సంఘాలకు రాయితీపై యంత్ర పరికరాలు అందించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రంధి రాము, ఏఓ బి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.